తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ బుధవారం 01 - 07 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజిలు : 2



## కంపు కొడుతున్న..

# మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల హాస్టల్

- విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వం
- పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదయ్

ప్రజావారధి/ఆలేరు

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే (ఎం.జె.పి.టి.బీ.సి. డబ్ల్యూ.ఆర్.) గురుకుల హాస్టల్‌లో నెలకొన్న దారుణ పరిస్థితులను చూసి తీవ్ర ఆందోళన కరంగా ఉన్నాయని, పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుకునే ఈ హాస్టల్‌లో కనీస మౌలిక వసతులు కూడా లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పీడీఎస్‌యూ యాదాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. ఉదయ్ అన్నారు. ఆలేరు హాస్టల్ ని పరిశీలించి, అక్కడి పరిస్థితులు చూసిన అనంతరం ఉదయ్ మాట్లాడుతూ హాస్టల్ సమస్యలకు నిలయంగా మారిందని, మరుగుదొడ్లు పూర్తిగా అపరిశుభ్రంగా మారాయని, మరుగుదొడ్లలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఎక్కడ చూసినా మురికి, దుర్వాసన, నీరు నిలిచిపోయి కనిపిస్తున్నాయని, వాటిని శుభ్రం చేసే సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.



పరిశుభ్రత లేకపోవడంతో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, చర్మ వ్యాధులు, జీర్ణ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గురుకుల విద్యను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు మాత్రం పూర్తిగా భిన్నంగా ఉన్నాయన్నారు. ప్రచారానికి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం విద్యార్థులకు కనీస మరుగుదొడ్ల నిర్వహణకు కూడా నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. జిల్లా అధికారులు, గురుకుల విద్యాసంస్థల అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయకపోవడంతో ఇలాంటి దారుణ పరిస్థితులు నెలకొంటున్నాయని తెలిపారు. ఉన్నతాధికారులు వెంటనే హాస్టల్‌ను పరిశీలించి మరుగుదొడ్లను శుభ్రం చేయించాలని, శాశ్వత పారిశుధ్య కార్మికులను నియమించాలని, హాస్టల్ పరిసరాల్లో బ్లీచింగ్, ఫాగింగ్ చేపట్టి వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని కోరారు. వెంటనే సమస్యలు పరిష్కరించనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పీడీఎస్‌యూ. ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.




## కళాశాల విద్యార్థిని విద్యార్థులకు రక్షణ కల్పించాలి

○ టిఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంతోష్ కుమార్

ప్రజావారధి/ఆలేరు

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో ఐటిఐ డిగ్రీ కాలేజీ జూనియర్ కాలేజీ ఉన్నత పాఠశా విద్యార్థిని విద్యార్థులకు పోలీసులు రక్షణ కల్పించాలని టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భోగ సంతోష్ కుమార్ కోరారు. మంగళవారం ఆలేరు సీఐ యాలాద్రికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళ కళాశాలల సమీపంలో విద్యార్థుల భద్రతపై పోలీసు పెట్రోలింగ్ నిర్వహించాలని కోరారు. అదేవిధంగా బస్టాండ్‌లో కానిస్టేబుళ్లను రక్షణగా ఉంచాలని కోరారు.



# శర్భనాపురం పాల సంఘం నూతన చైర్మన్‌గా పరశురాములు



**ప్రజావారధి/ఆలేరు**
ఆలేరు మండలం శర్బనాపురం గ్రామంలోని మదర్ డెయిరీ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం నూతన చైర్మన్‌గా కాంగ్రెస్ నాయకుడు సుదగాని పరశురాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన పాలసంఘం ఎన్నికల్లో ఆయనతో పాటు డైరెక్టర్లుగా సైదాపురం మల్లయ్య, బద్దం ముత్తిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ సుదగాని పరశురాములు మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల సంక్షేమం, సంఘం సమగ్ర అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానన్నారు. పాడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని, సభ్యులందరి సహకారంతో సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి తనను చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్న డైరెక్టర్లు, సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతన సంఘాన్ని సన్మానించి శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు సైదాపురం సురేష్, మండల నాయకులు బుగ్గ నవీన్, సీత శ్రీహరి, కారె రమేష్, డైరెక్టర్లు గడ్డమీది రామచంద్రు, కందుల యాదగిరి, బుగ్గ ఎర్రయ్య, బోడ నరేష్, సుదగాని భాగ్య, అంగడి శ్రీను, కారె రాజు, రైతులు సైదాపురం నర్సయ్య, బుగ్గ నర్సయ్య, బోడ రాంనర్సయ్య, సైదాపురం యాదగిరి, సూదగని సత్యరాజయ్య, బొమ్మెల భిక్షపతి, సైదాపురం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.